# పుస్తక పరిచయం




*Vinjamuri Ragasudha*
*Flat# 13, Guinevere Court*
*Lancelot Road*
*Wembley HAO 2FH, UK*

‘కౌముది‘ పాఠకులకి కవయిత్రి రాగసుధ గారు చిరపరిచితులే. లండన్‌లో పర్యాటక శాఖ నిర్వహణా అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. పేరొందిన శాస్త్రీయ నృత్యకళాకారిణి కూడా ఐన రాగసుధ గారు లండన్‌లో జరిగే తెలుగు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకైన పాత్ర వహిస్తుంటారు. రాగసుధగారి కలం నుంచీ వెలువడిన కవితల సంపుటి ఈ ‘కవితా రగసుధ‘. ప్రముఖ చిత్రకారుడు బాపుగారి ముఖచిత్రం తోనూ, చంద్రగారి రేఖాచిత్రాలతోనూ అందంగా రూపుదిద్దుకుంది ఈ కవితా సంపుటి. చాలా కవితలు చక్కటి, చిక్కటి ప్రబంధ గ్రాంధిక భాషలో సాగుతాయి. వచనకవితా ప్రవాహంలో అందరూ కొట్టుకుపోతున్న ఈ రోజుల్లో సుగంధపరిమళ భరితమైన పదాలతో కవితలని కూర్చిన రాగసుధ గారిని అభినందించి తీరాలి. పదాల పొందికకి చక్కటి ఆలోచనలు కూడా తోడవడం ప్రశంసనీయం. ‘అలకల అల్లరులకే అలజడి చెందే అంగనకు / అంగాంగమున అంతరంగమున అంపశయ్య అందచేసిన / అంగజునికి అభివాదము ..‘ నడకలో కొన్నీ , ‘సృష్టి నేర్పని రాగమది / భాషకందని భావమది..‘ నడకలో కొన్నీ అలవోకగా సాగుతాయీ కవితలు. కొన్ని కొన్ని కవితల ముగింపు ఏదో ప్రకటన చేసినట్లనిపిస్తుంది. ఇలా స్టేట్ మెంట్ ఇచ్చినట్లు కాక, కవితాత్మక ముగింపులు ఇచ్చి ఉంటే చదువరుల మనసుల్లో ముద్రించుకు పోయే అవకాశం ఎక్కువగా ఉండేది. ఇది చిన్న సలహానే తప్ప లోటు మాత్రం కాదు. మొత్తం మీద ‘వెన్నెల వానలో తడిసి మెరిసే / అరవిరిసిన నవ మల్లిక ‘ల లాంటి చాలా కవితలు కవితా ప్రియులని అలరిస్తాయనడంలో సందేహం లేదు.

***




కెనడాలో స్థిరపడిన తెలుగు రచయితల కథా సంకలనం ఈ 'పడమటి కనుమల్లో తరుణోదయం'. చక్కటి ప్రయత్నం, అందమైన ముద్రణ, వైవిధ్య భరితమైన కథాంశాలు..అన్నీ కలిసి ఈ పుస్తకాన్ని ఆసాంతం చదివిస్తాయి. ముందు మాటలో డా. కె.కె. గారు చెప్పినట్లు "ప్రవాసాంధ్రులు అంటే కేవలం అమెరికా తెలుగు వాళ్ళు మాత్రమే అన్న అపప్రథను కెనడీయులైన ఈ తెలుగు రచయితలు చెరిపివేశారు. తెలుగు భాష పట్ల సంస్కృతి పట్ల నిక్కమైన నెనరును(ప్రేమ) చూపించిన వీరిని, వీరి కథలను సాదరంగా తెలుగు కథల ప్రపంచంలోకి ఆహ్వానిద్దాం'. కొమరవోలు సరోజ, శేషు అప్పారావు, మంగళకందూర్, సోమయాజుల సోదరులు, నెల్లుట్ల నవీనచంద్ర లు వ్రాసిన 25 కథల సంకలనం ఈ పుస్తకం. ప్రతి విభాగం మొదట్లోనూ ఆయా రచయితల రచనా శైలిని సంక్షిప్తంగా పరిచయం చేయడం బావుంది. ఐదుగురు రచయితలదీ ఐదు రకాల రచనా శైలి. ఒక విభాగంలో అంతరంగ సంఘర్షణలుంటే, మరో విభాగంలో చమత్కారాలు, ఇంకో విభాగంలో సరసమైన ప్రేమ కథలు..ఇలా సాగుతూ ప్రతి కథా ఆసక్తికరంగా చదివిస్తుంది. కెనడా జీవనవిధానాల నేపథ్యాలతో బాటు, మాతృదేశంలోని పాత్రలతో, సంఘటనలతోనూ కథలు సాగడం అభినందనీయం. కెనడా ప్రవాసాంధ్ర రచయితలనుంచీ ఇలాంటి సంకలనాలు మరిన్ని రావాలని మనసారా ఆశిద్దాం.

***

**Honey Publications**
**9885451014**

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor, KOUMUDI(Web Monthly)
425- Escudo Ct, Dublin, CA 94568,USA